ప్రజాశక్తి

మంగళవారం 11 మార్చి, 2025

5

శ్రీకాకుళం

రేపు 'యువత పోరు'

నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధ్యక్షులు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 12న జిల్లా కేంద్రంలో యువత పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఫీజు పోరులో విద్యార్థులు, వైసిపి నాయకులు పాల్గొవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : ఈ నెల 12న యువత పోరు పోస్టర్‌ను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 9 గంటల టెక్కలి వైసిపి కార్యాలయం వద్ద ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్‌కు చేరుతుందన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని జగనన్న ప్రజాసేవ కార్యాలయం వద్ద నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, పద్మజ, శ్యామ్, బొడ్డేపల్లి అజంతాకుమారి, బొడ్డేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

బీడు భూములకు జల'కళ' వచ్చేనా?

- బోర్ల తవ్వకాలకు నాలుగేళ్ల కిందట దరఖాస్తుల స్వీకరణ
- 5,714 మంది దరఖాస్తు చేయగా 246 మందికే అవకాశం
- ఖజానాపై భారం పేరుతో ఆపేసిన గత ప్రభుత్వం
- ఇటీవల బడ్జెట్‌లో ప్రస్తావనతో రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

కోటబొమ్మాళి మండలం ఊడికలపాడులో ట్రాన్స్‌ఫార్మర్ వేసి కనెక్షన్ ఇవ్వని అధికారులు (ఫైల్)

సాగునీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిన భూములను వినియోగంలోకి తెచ్చేందుకు గత ప్రభుత్వం వైఎస్ఆర్ జలకళ పథకాన్ని ప్రారంభించినా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. బోర్లతో పాటు విద్యుత్ కనెక్షను కూడా అందిస్తామని చెప్పడంతో రైతులు ఉత్సాహంగా దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణ, సర్వే పూర్తి చేసి అర్హులైన వారికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. తొలుత పూర్తి ఖర్చు తామే భరిస్తామని ప్రభుత్వం చెప్పింది. తర్వాత రూ.2 లక్షల వరకు చెల్లిస్తామంటూ ఉత్తర్వులు జారీ చేసింది. రైతులు అదనపు ఖర్చుకు సిద్ధపడినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ఆ పథకం అలానే నిలిచిపోయింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చిన్న, సన్నకారు రైతులకు మేలు కలిగించేందుకు వైసిపి ప్రభుత్వం సెప్టెంబరు 28, 2020లో ప్రారంభించింది. బోరు సౌకర్యం లేని 2.5 ఎకరాలు నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులను అర్హులుగా పేర్కొంది. బోర్ల తవ్వకం, విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇస్తామంటూ ప్రకటించింది. ప్రస్తుతం అందులో మార్పులు చేయడంతో అన్నదాతలు ఉసూరుమంటున్నారు. ఐదెకరాల్లోపు వారికి సైతం రూ.2 లక్షలోపు మాత్రమే విద్యుత్ కనెక్షన్ల ఖర్చు చేస్తామని, అంతకంటే ఎక్కువ అయితే రైతులే భరించాల్సి ఉంటుందని పేర్కొంది. అయినా రైతులు ఖర్చుకు వెనుకాడకుండా బోర్లు తవ్వించుకోవడానికి సిద్ధపడ్డారు. జిల్లాలో వైఎస్ఆర్ జలకళ పథకం కోసం మొత్తం 5,714 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో 4,690 దరఖాస్తులు అర్హమైనవిగా తేల్చారు. వాటిలో 2,299 చోట్ల సర్వే పూర్తి చేశారు. సర్వే పూర్తయిన వాటిలో 1057 ప్రాంతాల్లో బోర్ల తవ్వకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటివరకు 246 చోట్ల బోర్లు తవ్వారు. 229 ప్రాంతాల్లో నీళ్లు పడగా 17 చోట్ల నీరు పడలేదు. 13 మంది రైతుల పొలాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు.

అర్ధాంతరంగా బోర్ల తవ్వకాలు నిలిపివేత

సాధారణంగా ఒక ట్రాన్స్‌ఫార్మర్, నాలుగు విద్యుత్ స్తంభాలు వేస్తే రూ.2 లక్షల అంచనా వ్యయం దాటిపోతుంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మంది ఒకటి నుంచి రెండు కిలోమీటర్ల మేర స్తంభాలు వేయాల్సిన వారు ఉన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌తో కలిపితే వారికి రూ.5 నుంచి రూ.6 లక్షలు దాటిపోతోంది. ప్రభుత్వం కనీసం రూ.రెండు లక్షలు ఇచ్చినా మిగిలిన ఖర్చు భరించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన కనిపించడం లేదు. ఐదెకరాల లోపు ఉన్న రైతులకు రూ.2 లక్షల వరకు విద్యుత్ కనెక్షన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని చెప్పినా ఆ తర్వాత ఎవరికీ డబ్బులు చెల్లించలేదు. ఎక్కడా ఒక్క కనెక్షన్ ఇవ్వలేదు. కొన్నిచోట్ల విద్యుత్‌శాఖ కనెక్షన్లు ఇచ్చినా వాటికయినా ఖర్చునూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది. ప్రభుత్వం విద్యుత్‌శాఖకు డబ్బులు ఇవ్వకపోవడంతో కనెక్షన్లను ఆపేసింది. దీంతో బోర్లు తవ్వి విడిచిపెట్టేయంతో చాలాచోట్ల మట్టి కూరుకుపోయింది. తమకు త్వరగా విద్యుత్ సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు

నిధుల కేటాయింపు జరిగేనా?

చిన్నసన్నకారు రైతులను ఆదుకునేందుకు గతంలో ఇందిర జలప్రభ, ఎన్‌టిఆర్ జలసిరి పేర్లతో ప్రభుత్వాలు అమలు చేశాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని మార్పులు చేసి వైసిపి జలకళగా పేరు మార్చింది. బోర్లు, విద్యుత్ కనెక్షన్లు ఉచితంగా ఇస్తామని ప్రకటించడంతో రైతులు ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రారంభం నుంచి పలు నిబంధనలు మార్చడం, గిట్టుబాటు కాక డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు రాకపోవడం, నిధుల లేమి, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తదితర కారణాలతో పురోగతి కనిపించడం లేదు. జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస నియోజకవర్గాల్లో మాత్రమే బోర్ల తవ్వకాలకు డ్రిల్లింగ్ ఏజెన్సీలు ముందుకు వచ్చాయి. ప్రభుత్వం చెల్లిస్తున్న ధర గిట్టుబాటు కావడం లేదంటూ మిగిలిన నియోజకవర్గాల్లో ఏజెన్సీలు ఆసక్తి చూపడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎన్‌టిఆర్ జలసిరి కోసం పది వేల మంది రైతుల పొలాల్లో ఉచితంగా మోటర్లు వేయిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అంగన్వా'ఢీ'లు

- కనీస వేతనంపై అసెంబ్లీలో ప్రకటన చేయాలంటూ డిమాండ్
- 'చలో విజయవాడ'ను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ధర్నాలు

శ్రీకాకుళం అర్బన్ : కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలకు వేతనాలు పెంచుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసెంబ్లీలో ప్రకటన చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి డిమాండ్ చేశారు. అంగన్వాడీల చలో విజయవాడపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధానికి నిరసనగా, 42 రోజుల సమ్మె మినిట్స్ అమలు చేయాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ముందుగా నగరంలోని వాంబే కాలనీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రభుత్వం గత ప్రభుత్వం ఇచ్చిన జిఒయే ఇచ్చి మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ జిఒ ఇచ్చారని తెలిపారు. శాంతియుతంగా చలో విజయవాడ చేపడితే గృహ నిర్బంధాలు, అరెస్టులు, బెదిరింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. అంగన్వాడీలపై అధికారులతో తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చి అడ్డంకులు సృష్టించిందన్నారు. ప్రజాస్వామికంగా వ్యవహరిస్తానని చెప్పిన చంద్రబాబు అందుకు విరుద్ధంగా నిర్బంధాన్ని అమలు చేయడం సరికాదన్నారు. సమస్యలపై ఉమ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికలు ముందు అంగన్వాడీల 42 రోజులు సమ్మె సందర్భంగా టిడిపి నాయకులు సమ్మె శిబిరాలలో పాల్గొని మద్దతు తెలిపి మేం అధికారంలోకి వస్తే న్యాయం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.సుజాత, కె.హేమలత, కె.లక్ష్మి, మాధవి, చంద్రమౌళి, పి.భూలక్ష్మి, టి.రాజేశ్వరి, అప్పమ్మ, లలిత, ఇ.అప్పలనర్సమ్మ, కె.జ్యోతి పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టిన ధర్నాలో యూనియన్ నాయకులు చింతాడ ఇందుమతి, హనుమంతు వాణిశ్రీ, బొడ్డేపల్లి రమణమ్మ, పద్మం, ప్రభావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

పలాస: ఆర్‌డిఒ కార్యాలయం వద్ద చేపట్టిన అంగన్వాడీ ధర్నాలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హైమావతి, బి.సునీత, యం.మంజులకుమారి, డి.సునీత, హేమలత, బి.నిర్మల, కె.జ్యోతి, బి.చామంతి, ఇందుమతి, జయలక్ష్మి, అప్పలనరసమ్మ, మాలతి, నాగేశ్వరి, భువనేశ్వరి, సరోజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ వెంకటేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఇచ్ఛాపురం : తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా తహశీల్దార్ శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు.

టెక్కలి రూరల్ : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

పలాస : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

ఇచ్ఛాపురం : ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న తులసీదాస్

నేటి నుంచి ప్రజా చైతన్య యాత్రలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలు ఈ నెల 11 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నామని, ఈ యాత్రలను విజయవంతం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పిలుపునిచ్చారు. నగరంలో సిపిఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. జిల్లాలో జీడీ పంటకు గిట్టుబాటు ధర కల్పించి, ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో షెడ్యూల్డ్ ఏరియాతో కూడిన ఐటిడిఎను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్గో ఎయిర్ పోర్టు కోసం బలవంతపు భూ సేకరణ ఆపాలన్నారు. సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టపెట్టొద్దన్నారు. వంశధార ఆధునికీకరణకు రూ.1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టులు పూర్తి చేయడానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలన్నారు. సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి, పి.తేజేశ్వరరావు పాల్గొని మాట్లాడారు.

18న 'చలో విజయవాడ'

మధ్యాహ్న భోజన కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు మహాలక్ష్మి

మాట్లాడుతున్న మహాలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకానికి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిధులు కేటాయించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉత్తర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నిధులు కేటాయింపులు పెంచాలని కోరుతూ ఈ నెల 18న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నగరంలోని సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వంట కార్మికులకు రూ.3 వేలు వేతనమిస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. ఈ పథకం ప్రారంభించి 23 ఏళ్ల గడుస్తున్నా... ఇంకా తక్కువ వేతనాలకే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పిల్లలకు ఇస్తున్న మెనూ ఛార్జీల్లో మార్పులేదన్నారు. మరోవైపు మెనూల మార్పుల పేరుతో కార్మికులపై అదనపు భారాన్ని మోయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నారని, రాజకీయ వేధింపులు రోజురోజుకూ అధికమవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన నీమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అన్నారు. వంట కార్మికులను తొలగించి ప్రయివేటు సంస్థలకు అప్పగించడం వల్ల భోజనం వృథా అవుతుందన్నారు. ప్రయివేటు ఏజెన్సీలు సరఫరా చేస్తున్న భోజనాలను పిల్లలు సక్రమంగా తినడంలేదన్నారు. వంట సమయంలో ప్రమాదాల బారిన కార్మికులకు ప్రమాద బీమా వర్తింపజేయాలన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎన్.గీతాబాలా, కౌసల్య, తులసమ్మ, లక్ష్మి, తులసి, ప్రవీణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

ఉగాది నుంచి స్వర్ణాంధ్ర-47 పి4 ప్రారంభం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన స్వర్ణాంధ్ర-2047 కార్యాచరణలో భాగంగా సమగ్ర అభివృద్ధికి జీరో పావర్టీ పి4 విధానం అమలు ప్రక్రియ జిల్లాలో మొదలైందని, అందులో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. జెడ్‌పి సమావేశ మందిరంలో దీనికి సంబంధించిన సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌లోని పది సూత్రాల్లో సంపూర్ణ పేదరిక నిర్మూలన లక్ష్యమన్నారు. ప్రభుత్వం పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ పార్టనర్ షిప్ (పి4) విధానాన్ని ఉగాది నుంచి ప్రారంభించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పి4 విధానం అమలు కానుందన్నారు. యువతకు నైపుణ్యాలతో కూడిన శిక్షణ అందించడం, ప్రతిఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు, సుస్థిర ఉపాధి అవకాశాల సృష్టి, వృద్ధికి దోహదం చేసే మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించేందుకు ఇది తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంపై ప్రజల నుంచి సూచనలు తీసుకుంటామని అన్నారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, https://swarnandhra.ap.gov.in/p4 లింక్ ద్వారా ఈ నెల 25లోగా అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరారు. అభిప్రాయాలు తెలియజేసిన వారిని ప్రశంసిస్తూ ప్రశంసాపత్రం వెబ్‌సైట్‌లో జెనరేట్ అవుతుందని తెలిపారు.

'మీకోసం'కు 141 వినతులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో సుదీర్ఘకాలం తర్వాత ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం సోమవారం నిర్వహించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వరరావులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సామాజిక, వ్యక్తిగత సమస్యలతో కూడిన 141 వినతులు స్వీకరించారు. స్వీకరించిన వినతుల్లో పెద్దపాడు-తంగివానిపేటకు చెందిన దళితులకు పెద్దపాడు గ్రామ సమీపాన 1976లో సర్వే నంబరు 68-2లో లోపింటి రామయ్యకు ప్రభుత్వం డీపట్టా మంజూరు చేసిందని అన్నారు. ఆ భూములు 2018 వరకు ఆయన స్వాధీనంలో ఉన్న భూమిని వేరొకరు ఆక్రమించుకున్నారంటూ అతని వారసులు అప్పయ్య, సవలాపురపు అప్పన్న, పుట్టా ఇందుమతిలు ఫిర్యాదు చేశారు. ఇచ్ఛాపురం మండలం మండపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షా కేంద్రం మంజూరైందని, కానీ, ఆ గ్రామానికి బస్ సౌకర్యం లేక పోవడంతో విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోందని సర్పంచ్ ప్రతినిధి పిట్టా మామయ్య వివరించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఆర్‌టిసి బస్ నడపాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కేంద్రానికి కొళిగాం, బిర్లంగి, రత్తకన్న హైస్కూళ్ల నుంచి విద్యార్థులు పరీక్ష రాసేందుకు వస్తున్నారని వివరించారు. ఈ గ్రామానికి తక్షణమే ఆర్‌టిసి బస్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ జిల్లా ప్రజా రవాణాధికారి విజయకుమార్‌ను ఆదేశించారు. కొత్తూరు. మండలం మెట్టూరుకు చెందిన బత్తిలి జయమ్మకు 144 -1 సర్వే నంబరులో మూడు సెంట్లు ఇంటి స్థలం తరగాన సింహాచలం ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని మండల సర్వేయర్ పాత తేదీలతో పొజిషన్ ధ్రువపత్రాన్ని వేరొకరి పేరుతో జారీ చేశారని అన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు. గార మండలం అంబళ్లవలస, పూసర్లపాడు, సాలిహుండం సాగునీటి కాలువలను మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు వీలు కల్పించాలని కొంక్యాన ఆదినారాయణ కోరారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జెడ్‌పి సిఇఒ ఎల్.ఎన్.వి.శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్, ఎంటర్‌ప్రైస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) సంయుక్తంగా ఈ నెల 12న పాతపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పీడీ కిరణ్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో సంక్య ఇండియా, డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తాయన్నారు. సంక్య ఇండియా కంపెనీ ప్యాకింగ్, హెల్పర్స్ (65 ఖాళీలు) ఉద్యోగాలకు 7వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హత కలిగిన 18-40 సంవత్సరాల వయసు గల పురుషులను ఎంపిక చేస్తుందని చెప్పారు. జీతం నెలకు రూ.12 వేలు, డెక్కన్ ఫైన్ కెమికల్ కంపెనీ ట్రైనీ కెమిస్ట్ (50 ఖాళీలు) ఉద్యోగాలకు బిఎస్‌సి కెమిస్ట్రీ, బిజెడ్‌సి విద్యార్హత కలిగిన 18-27 సంవత్సరాల వయస్సు గల పురుషులను ఎంపిక చేస్తుందన్నారు. జీతం నెలకు రూ.17 వేలు అందజేస్తారన్నారు. ఈ ఉద్యోగ మేళా ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు రేషన్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బయోడేటాతో హాజరు కావాన్నారు. మరిన్ని వివరాలకు 7989744612 నంబరును సంప్రదించాలన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

నాటుసారాను నిర్మూలిద్దాం

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

నాటు సారాను నిర్మూలించి భవిష్యత్ తరాలకు బాట వేద్దామని, నాటు సారా తయారు చేసేవారు, తయారీకి సహకరించిన వారిపై పీడీ చట్టాన్ని అమలు చేసి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడిగుడ్డిలో ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యాన నవోదయం 2.0 కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారాపై ప్రజల్లో అవగాహన కల్పించి వాటి నిర్మూలనకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. నాటుసారా వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమవుతున్నాయని, భవిష్యత్ తరాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. నాటుసారాను అరికట్టి ప్రజలందరినీ ఉజ్వల భవిష్యత్ వైపు నడిపించేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని చెప్పారు. నాటుసారా తయారు చేయడం ఆపేసిన వారికి ఆర్థికంగా రుణాలు అందించడం వ్యాపారాలను ప్రారంభించేందుకు సహాయాన్ని అందించడం వంటి చర్యలు తీసుకుంటుందన్నారు. తాను చదువుకునే వయసులో తన గ్రామంలో నాటుసారా వల్ల ఎన్నో ఇబ్బందులు కళ్లారా చూశానని అన్నారు. ప్రస్తుతం అటువంటివేవీ లేకుండా ప్రజలందరూ జీవనోపాధి వైపు నడిచారని అన్నారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో, వ్యాపారాల్లో స్థిర పడ్డారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలందరూ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. నాటుసారా అమ్మే వారికి, కొనేవారికి భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు లభించే పరిస్థితి ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని నాటుసారా తయారు, రవాణా, కొనుగోలు చేయడం ఆపేయాలని సూచించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఫిర్యాదులను, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 14405కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చున్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి తిరుపతినాయుడు, టెక్కలి ఎక్సైజ్ సిఐ ఎస్.కె.మీరాసాహెబ్, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, తహశీల్దార్ బడే పాపారావు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE 4th ADDITIONAL DISTRICT JUDGE CUM SC&ST COURT AT SRIKAKULAM

IA 483/2024 in AS 49/2018 (LR Petition or 22 Rule4)

BETWEEN:
Kaspa Malleswara Rao ....Appellant
AND
Kaspa Venkataramana(Died) And 18 others ... Respondents
Proposed Respondent No.23
To
Kaspa Varalaxmi D/o late Venkataramana
Age 40 years, Kaspa Street, Srikakulam

NOTICE

పై నెంబర్ LR Petition లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ 4th Additional District Judge cum SC & ST Court, Srikakulam వారు ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు పై నెంబర్ పిటిషన్ లో ఎటువంటి అభ్యంతరములు ఉన్న, స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గా గాని తేదీ: 20.03.2025 న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేసుకోవలెను లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరిని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

N. విజయకుమార్
అడ్వకేట్, శ్రీకాకుళం

IN THE HONOURABLE COURT OF THE 4th ADDITIONAL DISTRICT JUDGE CUM SC&ST COURT AT SRIKAKULAM

IA 482/2024in AS 49/2018 (Abetment or 22 Rule 9)

BETWEEN:
Kaspa Malleswara Rao ....Appellant
AND
Kaspa Venkataramana(Died) And 18 others ... Respondents
Proposed Respondent No.23
To
Kaspa Varalaxmi D/o late Venkataramana
Age 40 years, Kaspa Street, Srikakulam

NOTICE

పై నెంబర్ Abetment Petition లో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ 4th Additional District Judge cum SC & ST Court, Srikakulam వారు ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు పై నెంబర్ పిటిషన్ లో ఎటువంటి అభ్యంతరములు ఉన్న, స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గా గాని తేదీ: 20.03.2025 న ఉదయం గం.10.30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేసుకోవలెను లేనియెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరిని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

N. విజయకుమార్
అడ్వకేట్, శ్రీకాకుళం

IN THE HONOURABLE COURT OF MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL CUM-SPECIAL SC/ST POA CUM IV ADDITIONAL DISTRICT JUDGE: VIZIANAGARAM
IA /2024 IN M.V.O.P.307/2024

Between:
Routhu Balakrishna .....Petitioner
And:
Bora Someswara Rao and others..Respondents
TO:
Respondent No.1:
Bora Someswara Rao,S/o. Ramulu, Auto Driver, Darapuvanipeta Village, Etcherla Mandal, Srikakulam District.

NOTICE

Please take notice that the above named petitioner filed a MVOP against respondent 1, for recovery of amount from the Respondent 1 issue to notice to the Respondent 1 and for service of summons notice, in the meanwhile as per the Honourable Court Order issue notice to the R.1, and the same stands posted to 25.03.2025 on that day you have to appear before this Honourable court either personally or through an Advocate by 10.30 A.M along with your documents, failing which the matter will be decided in your absence as per Law.

MAJJI YOGESWARA RAO,
ADVOCATE,
VIZIANAGARAM.

పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అన్ని అనుమతులను సత్వరమే మంజూరు చేసి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఇపిసి) సమావేశం జూమ్ ద్వారా సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కలెక్టర్ జిల్లాలోని ఆయా ఉన్నతాధికారులతో కలిసి చర్చించారు. పరిశ్రమల స్థాపనతోనే ఆర్థిక ప్రగతి సాధించగలమని, సింగిల్ డెస్క్ విధానం కింద కొత్తగా పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తుల పురోగతిని సమీక్షించారు. ఎపిఐఐసి భూముల కేటాయింపులు, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణానికి రెండు నుంచి ఐదు ఎకరాల వరకు భూసేకరణ చేపట్టాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పిఎంఇజిపి) కింద చేపట్టిన పనుల ప్రగతిని అంచనా వేసి, పిఎం విశ్వకర్మ పథకం అమలుపై సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఈ పథకానికి 11952 దరఖాస్తులు రాగా, 8173 మంది అర్హత సాధించామన్నారు. వారిలో 5884 మందికి శిక్షణ పూర్తయిందని తెలిపారు. ఇప్పటివరకు 917 మందికి రుణ సదుపాయం కల్పించామన్నారు. మిగిలిన అర్హులకూ త్వరగా రుణాలు అందించాలని ఆదేశించారు. ఎంసిఎంఇ సర్వే తాజా నివేదికను పరిశీలించి, నూతన పారిశ్రామిక విధానం 4.0 మార్గదర్శకాలపై చర్చించారు. ఈ జూమ్ సమావేశంలో కన్వీనర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం కె.విజయరత్నం, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాంబాబు, ఎల్‌డిఎం సూర్యకిరణ్, సుడా అధికారి కృష్ణ, గ్రౌండ్ వాటర్ డిడి రమణమూర్తి, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీమోహన్, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కరుణశ్రీ, ఎపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పరిష్కారానికి శ్రద్ధ వహించి ఆయా ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి, చట్ట ప్రకారం పరిష్కార చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఎస్‌పి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార కార్యక్రమంలో ఎస్‌పి 52 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు, వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. ఈ సందర్భంగా వృద్ధులు, వికలాంగ అర్జీదా రులు వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.

నోటీస్ అందిస్తున్న ఇఒ వీరభద్రస్వామి

ఆక్రమణలు తొలగించాల్సిందే

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఆక్రమణలు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, ఆక్రమణలన్నీ తొలగించాల్సిందేనని మేజర్ పంచాయతీ కవిటి ఎగ్జిక్యూటివ్ అధికారి వీరభద్రస్వామి తెలిపారు. 'ఆక్రమించేస్తున్నా.. ఆలోచిస్తున్నారు' అంటూ ఈ నెల 19న 'ప్రజాశక్తి'లో వచ్చిన కథనానికి ఇఒ స్పందించారు. కవిటి మండల కేంద్రంలోని మొగిలిపురి నాగేశ్వరరావుకు నోటీస్ అందించి తక్షణమే సిసి రోడ్డుపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచించారు. లేని పక్షంలో తామే తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇటీవల కాలంలో ఎన్నికల కోడ్ వల్ల కొన్ని కార్యక్రమాలు చేయలేకపోయామని తెలిపారు. మార్చి నెలాఖరులోగా మండల కేంద్రంలోని అన్ని ఆక్రమణలు తొలగించి చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని తెలిపారు. గ్రామాల్లో కూడా పరిశీలించి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజోపయోగమైన ఈ కథనంపై స్థానికంగా విశేషమైన స్పందన లభించడమే కాకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న 'ప్రజాశక్తి' అభినందనలు కూడా అందుకుంది.

ఎంఆర్‌సి పరిసరాలు పరిశీలిస్తున్న డిఇఒ

డ్రాపౌట్స్ లేకుండా చూడాలి

డిఇఒ తిరుమల చైతన్య

రణస్థలం: మండలంలో డ్రాపౌట్స్ లేకుండా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య మండల విద్యాశాఖాధికారి ఎ.త్రినాథరావు, ఎంఇఒ-2 బి.లావణ్యకు ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నూతన పాఠశాలల సముదాయాల నిర్వహణ ఇక మీదట పాఠశాల సముదాయాల సమావేశాల నిర్వహణ కేవలం ప్రతి నెల మూడవ శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 5 గంటల వరకు మాత్రమే నిర్వహించబడుతుందని, 3వ శనివారం సెలవు అయితే 4వ శనివారం నిర్వహించబడుతుందన్నారు. పాఠశాల సముదాయాల సమావేశం రోజున అన్ని పాఠశాలల్లో ఖచ్చితంగా మధ్యాహ్నం 11.45కి మధ్యాహ్న భోజన కార్యక్రమం పూర్తవ్వాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ప్రేవేటు పాఠశాలలకు దీటుగా విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు పూర్తిస్థాయిలో కృషి చేసి మంచి ఫలితాలను అందించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎంఆర్‌సిలు, సిబ్బంది పాల్గొన్నారు.

'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

ఇచ్ఛాపురం : ఉద్యోగాల కల్పన డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన ఈ నెల 11న విజయవాడ చౌక్ వద్ద ధర్నా నిర్వహించనున్నారని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు చలో విజయవాడ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చే హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

స్వశక్తిపై ఆధారం

- కొండచీపుర్ల తయారీతో ఉపాధి
- ఆర్థిక స్వావలంబన దిశగా సీతానగరం మహిళల అడుగులు

ప్రజాశక్తి- నౌపడ

పుట్టింటి నుంచి రాని వస్తువు వారికి అత్తింటిలో ఉపాధినిస్తుంది. స్వయంగా కొండచీపురు తయారు చేసు కుంటూ ప్రగతిపథంలో దూసుకుపోతున్నారు సంతబొమ్మాళి మండలం సీతానగరం మహిళలు. ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. గ్రామానికి చెందిన బత్సల ధనలక్ష్మి దగ్గర కొండ చీపురుల తయారీ నేర్చుకున్న మహిళలు వీటిని తయారు చేసుకుంటూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. సుమారు 70 కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు.

సీతానగరానికి చెందిన బత్సల ధనలక్ష్మి పదేళ్ల కిందట బతుకు తెరువు కోసం అండమాన్ వలస వెళ్లింది. అక్కడ ఉపాధి నిమిత్తం పలు ప్రాంతాల్లో తిరిగి ఒక కుటీర పరిశ్రమలో మూడు నెలలపాటు చీపుర్ల తయారీ నేర్చుకుంది. అనంతరం తన భర్త సోమేశ్వరరావు ప్రోత్సాహంతో సొంత గ్రామంలోనే చిన్న కుటీర పరిశ్రమలు ప్రారంభించింది. మొదట్లో కాస్త పెట్టుబడి పెట్టి శ్రీముఖలింగం, మెళియాపుట్టి ప్రాంతాల నుంచి చీపురుకు కావలసిన కుంచెను, నారని తెచ్చి చీపుర్లు కట్టేది.

అది చూసిన చుట్టుపక్క మహిళలు ఆసక్తితో ఆమె ఇంటికి వెళ్లి నేర్చుకున్నారు. స్వయంశక్తి సంఘాల రుణాలతో ఉపాధి పొంది ముందుకు పోతున్నారు. గ్రామంలో 280 కుటుంబాలు ఉండగా, ప్రస్తుతం 70 పైగా కుటుంబాల వారు చేతి వృత్తిలా నిత్యం పనిచేస్తూ ఉంటారు. గ్రామంలో వంద మంది చీపుర్లు తయారు చేస్తూ రోజుకు రూ.400 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు. తయారు చేసిన చీపురులను శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా రాష్ట్రానికి ఎగుమతి చేసి అమ్ముతుంటారు. అయితే తిత్లీ తుపానుకు గ్రామంలో చీపుర్లు తయారీ సామగ్రి పూర్తిగా తడిచిపోయి రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని అంచనా. అయినా వాళ్లకి ఇంత వరకు నష్టపరిహారం అందలేదని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహించి మహిళా సంఘాల ద్వారా రుణాలను అందించడం ద్వారా మరింత మందికి ఉపాధి కలిగి వారి జీవితాల్లో వెలుగు నింపవచ్చు.

చీపుర్లు కట్టలు కడుతున్న మహిళలు

ప్రోత్సహించాలి

ధనలక్ష్మి దగ్గర పదేళ్ల క్రితం చీపుర్లు కట్టడం నేర్చుకున్నాను. ప్రస్తుతం నాకు ఇదే బతుకుతెరువు అయిఽది. రోజుకు రూ.700 వరకు అర్జిస్తున్నాను. డ్వాక్రా బజార్ మాలాంటి వారికి రుణాలు ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించాలి.

- నీలాపు లక్ష్మి, సీతానగరం

మహిళలను ప్రోత్సహిస్తున్నాను

అండమాన్లో ఒక కుటీర పరిశ్రమలో నేర్చుకుని, మా గ్రామంలో 70 మంది వరకు చీపుర్లు కట్టడం నేర్పించాను. ఇంటివద్దనే ఉంటూ రోజుకి రూ.వెయ్యి వరకు సంపాదించుకుటున్నాను. ఆసక్తిగా ఉన్న మహిళలను ప్రోత్సహించి నేర్పిస్తున్నాను. తిత్లీ తుపానుకు రూ.5 లక్షల వరకు నష్టపోయాను. అయినా, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి నష్టపరిహారం అందలేదు. మహిళా సంఘాల నుంచి రుణాలు మంజూరు చేసి మాలాంటి వాళ్లను ప్రోత్సహించాలి.

- బత్సల ధనలక్ష్మి. సీతానగరం

ప్రోత్సాహం అందజేస్తాం

సీతానగరంలో చీపుర్లు కడుతున్న మహిళలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహిస్తాం. ఇటీవల శ్రీకాకుళంలో నిర్వహించిన డ్వాక్రా బజారుకు మండలం తరపున పెద్ద ఎత్తున మహిళలు వెళ్లి చీపుర్లు విక్రయించారు. గతంలోనూ స్త్రీ నిధి రుణాలు అందజేశాం. దీన్ని చిన్నతరహా పరిశ్రమ గుర్తించాం. ఇలాంటి కుటీర పరిశ్రమలకు ప్రోత్సహించడానికి ప్రస్తుతం రూ.30 లక్షల వరకు బడ్జెట్ ఉంది. దీనిని అర్హులైన మహిళలు అందరూ వినియోగించుకోవాలి.

- సూర్యనారాయణ, వెలుగు ఎపిఎం

కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలి

రణస్థలం రూరల్: రైతు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనప్పుడు వాటిని నిల్వ చేసుకుని తిరిగి మార్కెట్ ధర ఉన్నప్పుడు అమ్ముకునేలా ప్రతి నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సోమవారం జరిగిన అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వాలు అన్ని విషయాల్లో అండగా ఉండాలన్నారు. రైతు పండించే వరి, మొక్కజొన్నతో పాటు ఇతర ఉద్యానవన పంటలకు, మత్స్యకారులు తెచ్చే మత్స్య సంపదకి గిట్టుబాటు ధర అందించినప్పుడే రైతుకి న్యాయం జరుగుతుందని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడం వలన రైతులకు ఎంతో లాభం చేకూరు తుందన్నారు. గిట్టుబాటు ధర లేక ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కాకపోవడంతో తమ ప్రాంతం నుంచి ఎక్కువమంది రైతులు, మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి రైతులు, మత్స్యకారులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.

జిల్లాల విభజనపై స్పష్టత ఇవ్వాలి

ఆమదాలవలస: రాష్ట్రంలో గత వైసిపి పాలనలో అనాలోచిత నిర్ణయాలతో చేపట్టిన జిల్లాల విభజనపై స్పష్టతను ప్రభుత్వం తెలియజేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం శాసనసభలో ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న రాజాంను విజయనగరం జిల్లా, పాలకొండను మన్యం జిల్లాలో చేర్చడం వల్ల విద్యార్థులు స్థానిక, స్థానికేతర ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు, జిల్లా పరిషత్, కోర్టు వ్యవహారాలు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా అంటూ కొనసాగించడం వలన ప్రజలు తికమక పడుతూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలంలో 56 ఎకరాల దేవాలయ భూములు ఇక్కడ ఉంటే రికార్డులో మన్యం జిల్లా అధికారుల పర్యవేక్షణలో ఉండటం వలన సరైన స్పష్టత లేక గజిబిజిగా మారిందన్నారు. గత సిఎం జగన్మోహన్ రెడ్డి 26 జిల్లాల ఏర్పాటు ప్రకటనకే తప్ప నేటికీ పూర్తిస్థాయి కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖామంత్రి స్పందించి జిల్లాల విభజనపై స్పష్టత ఉత్తర్వులు జారీచేయాలని కోరారు.

వైసిపి హయాంలో బిసి నేతలపై తప్పుడు కేసులు

పోలాకి: వైసిపి హయాంలో బిసి నేతలపై తప్పుడు కేసులు పెట్టారని, టిడిపి హయాంలో బిసిలకు సముచిత స్థానం కల్పించామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అసెంబ్లీ సమావేశంలో సోమవారం మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి బిసిలకు పార్టీకి అండగా నిలిచార న్నారు, మహాత్మ జ్యోతిరావు పూలే పేరున గురుకుల పాఠశాలలు సిఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని తెలిపారు.

ఎమ్మెల్సీ విక్రాంత్ పరామర్శ

ప్రజాశక్తి- బూర్జ

వైసిపి మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. గోవిందరావు అత్తయ్య లంక అమ్మాజమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని మండలంలోని మదనాపురంలో ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మామిడివలస ఎంపిటిసి గుమ్మడి రాంబాబుతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిటిపిసి స్వయంప్రతిపత్తి సంస్థ

ప్రజాశక్తి- పలాస

బాబూరావు

ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రామోషన్ కార్పోరేషన్ సంస్థ స్వయం ప్రతిపత్తి సంస్థ అని, స్వశక్తితో నడచే వ్యవస్థ ఉందని ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. పలాస తన కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంస్థకు బడ్జెట్లో నిధులు కేటాయించదని, ఇది సంపద సృష్టించే సంస్థ అని అన్నారు. ఎవరిపైనా ఆధారపడే సంస్థ కాదని అన్నారు. ఆస్తులపై రాబడి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం రూ.6 నుంచి రూ.7 కోట్ల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. తమ సంస్థలో పనిచేసిన 42 మంది సిబ్బందికి తమే జీతాలు సమకూర్చుకుంటామని చెప్పారు. పలాసలో కార్గో ఎయిపోర్టు నిర్మాణానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. మూలపేట వద్ద పోర్టు నిర్మాణం పూర్తయితే వేరొన్ గిడ్డంగులు నిర్మించేందుకు భూములు అవసరం అవుతాయని అన్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో మార్కెట్ విలువ ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. సంస్థ ఎండీ శేఖర్‌బాబు, ప్రిన్సివల్ సెక్రటరీ, ఫైనాన్స్ సెక్రటరీ, జనరల్ మేనేజర్‌తో కలిసి తాను ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ నుంచి డైరెక్టర్ బోర్డు సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

పాల ధరలు నిర్ణయించేది ప్రయివేటు కంపెనీలా?

మాజీ మంత్రి అప్పలరాజు విమర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పాల ధరలను ప్రభుత్వం నిర్ణయించకుండా ప్రైవేటు కంపెనీలు నిర్ణయించే పరిస్థితికి రావడం విడ్డూరంగా ఉందని, ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కూటమి ప్రభుత్వం ఉందని చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ ఏమి ఉంటుందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ధ్వజమెత్తారు. సోమవారం నగర శివారుల్లోని పెద్దపాడు వద్ద నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పాడి రైతులను కూటమి ప్రభుత్వం రోడెక్కిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటు డెయిరీ కంపెనీలు చెప్పిందే వేదంగా చంద్రబాబు ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. పాడి రైతులకు జగన్ ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ కార్యక్రమం ద్వారా సాయంగా నిలబడిందని ఆయన గుర్తు చేశారు. పాడి రైతులను బలవంతం పెట్టి తక్కువ ధరలకు ప్రైవేట్ డెయిరీలకు పాలు అమ్ము కుంటున్నారని, ఇది ప్రజలకు, ప్రభుత్వానికి కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూరు స్తోందన్నారు. హెరిటేజ్ సంస్థ వల్ల ఇప్పటికే చిత్తూరులో డెయిరీ మూతపడిందని ఆయన ఆరోపించారు. విజయ - విశాఖ డెయిరీ మిల్క్ సేకరణ తగ్గించమని మిల్క్ కలెక్షన్ సెంటర్లు ఆదేశించడం, పాల ధరలు సైతం తగ్గించడం అన్యాయమన్నారు. పశుసంవర్ధక మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు ఇవేవీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిమూలంగా పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఎవరు మాట్లాడినా కేసులు ఎలా పెట్టాలన్న దానిపై క్యాబినెట్ చర్చించడం కాదని, రైతుల కోసం చర్చించాలని ఆయన కోరారు. పక్క రాష్ట్రం తెలంగాణాలో పాల సేకరణ ధరలు తగ్గలేదని, ఆంధ్రాలో ఎందుకు తగ్గించాల్సి వచ్చిందో ప్రభుత్వం చెప్పాలన్నారు. మొబైల్ వెటర్నరీ క్లినిక్‌ను చంద్రబాబు ప్రభుత్వం నిలిపివేసిందని, కూటమి నేతలు సహజ వనరులను దోచుకుంటున్నారన్నారు. ఇప్పటికే పలాసలో ప్రజలకు అల్లుడు ట్యాక్స్ మొదలైందని అప్పల రాజు విమర్శించారు.

మాట్లాడుతున్న అప్పలరాజు

విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంఇఒ

విద్య ద్వారానే స్త్రీకి విముక్తి

కవిటి: విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించిన ఘనత సావిత్రిబాయి పూలేదని మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి కొనియాడారు. సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని కవిటి ఎంఆర్‌సి వద్ద ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయులైన సావిత్రిబాయి పూలే పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా అభివర్ణించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాలను సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసిన ఘనత సావిత్రిబాయి పూలేదని కొనియాడారు. కార్యక్రమంలో పలువురు మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్: వృద్ధాప్యంలో ఎదురవుతున్న ఆరోగ్య సమస్యలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎపి ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ జెఎసి ఛైర్మన్ చౌదరి పురుషోత్తం నాయుడు సూచించారు. సోమవారం ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఎపి ఎన్‌జిఒ హోంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.సోమసుందరరావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో జెమ్స్ ఆస్పత్రి జనరల్ సర్జన్ యురాలజీ వైద్యులు డా.హర్ష, ఎండి జనరల్ మెడిషన్ వైద్యులు డాక్టర్ మహేంద్ర హాజరై వైద్య పరీక్షలు చేపట్టి మందులు అందజేశారు. ఈ శిబిరంలో జెమ్స్ ఆస్పత్రి ఏరియా మేనేజర్ రవి, ఉషా డెంటల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కె.ఉషారాణి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి పి.ఎస్.ప్రసాదరావు, కోశాధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా సంఘసభ్యులు పి.నరసింహమూర్తి, గణపతి ఆచారి, లక్ష్మణరావు, చిన్మయరావు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గృహ నిర్బంధాలు అప్రజాస్వామికం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు అప్రజాస్వామిక చర్యలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎన్.మోహనరావు, బి.రామకృష్ణ అన్నారు. అంగన్వాడీలు చలో విజయవాడ పిలుపు మేరకు కార్యకర్త మంజూ ఆదివారం గృహ నిర్బంధాన్ని సోమవారం ఖండించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్బంధాలు ద్వారా ఉద్యమాలు ఆపలేరన్నారు. టిడిపి ప్రభుత్వం వైసిపి నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదన్నారు. వెట్టిచాకిరి చట్టరీత్య నేరమని చెప్పే పాలకులు, ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రహదారుల నిర్మాణానికి నిధులు విడుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో బిటి, సిసి రహదారులు, కాలువల నిర్మాణానికి రూ. 3 కోట్ల 69 లక్షల 50 వేలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పథకంలో మంజూరైన ఈ నిధులతో మూడు తారు రోడ్లకు రూ.266 లక్షలు, ఎనిమిది సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి 103.50 లక్షలు నిధులు మంజూరు చేశారని తొందరలోనే రహదారులు, కాలువలు నిర్మాణం జరగనున్నాయని పేర్కొన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణాలు జరిపించడానికి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. మండలంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న రహదారులు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సిఎం చంద్రబాబు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్ కళ్యాణ్, రోడ్లు, భవనాల శాఖామంత్రి బిసి జనార్దన్ రెడ్డికి ఎమ్మెల్యే కూన రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న కూలీలు

'ఉపాధి' కూలీల ఆర్థికసాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మర్రిపాడు-సి పంచాయతీ బంజీరుకు చెందిన ఉపాధి హామీ మేట్ గూడ హేమలతకు కూలీలు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ఆమె భర్త మార్కండేయ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి మృందారు. దీంతో గ్రామంలోని కూలీలంతా రూ.6,500 విరాళాలు సేకరించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలం పాల్గొన్నారు.

కవల దూడలను జన్మనిచ్చిన ఆవు

కవల దూడల జననం

మెళియాపుట్టి : మండలంలోని సవరకుడ్డబకు చెందిన రైతు సవర రామలింగానికి చెందిన ఆవు కవల దూడలకు సోమవారం జన్మనిచ్చింది. ఉదయం పశువుల శాలలో కట్టిన ఆవు వద్ద ఒకటి ఆడ, ఒకటి మగ లేగ దూడలు కనిపించింది. దీంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కవలు దూడలు చూసేందుకు తరలివచ్చారు.

దువ్వాడపై ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

ఎమ్మెల్సీ దువ్వాడపై ఫిర్యాదు

పొందూరు: ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జనసేన మండల ఉపాధ్యక్షుడు పొన్నాడ బాలకృష్ణ ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్సీ శ్రీనివాస్ ఫిబ్రవరి 24న టెక్కలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పవన్ కళ్యాణ్‌ను దుర్భాషలాడుతూ, జన సైనికులను సైకోలుగా అభివర్ణించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎటువంటి ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ, జన సైనికులను కించపరుస్తూ, శాంతి భద్రతలకు విఘాతం కలిగించి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించేలా దువ్వాడ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. వెంటనే ఎమ్మెల్సీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈయనతో పాటు మండల జనసేన నాయకులు కొంచాడ చిన్నం నాయుడు, గార బాబూరావు, వావిలపల్లి చక్రదర్, పైడి రాంబాబు, బెల్లాన శివ, ఆశపు శివ గోవిందరావు, సిమ్మి నాయుడు, పురుషోత్తం, సతీష్, ప్రకాష్ తదితరులున్నారు.

ఆర్‌టిసి బస్సు ఢీకొని గర్భిణి మృతి

- వైద్య పరీక్షలకు వెళ్లొస్తుండగా ప్రమాదం
- తీవ్ర రక్తస్రావంతో ఆస్పత్రికి తరలింపు
- చికిత్స పొందుతూ మృత్యువాత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాజేశ్వరి (ఫైల్)

నగరంలోని డేఅండ్‌నైట్ జంక్షన్ వద్ద గల నాగావళి వంతెన సమీపాన సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిండు గర్భవతి ప్రాణాలు కోల్పోయింది. తన భర్త ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనకనుంచి వచ్చిన ఆర్‌టిసి బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడ్డ గర్భిణీని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా రక్తస్రావం కావడంతో తల్లి, బిడ్డ మృత్యువాత పడ్డారు. మృతురాలు నగర సమీపాన గల కుంచాల కురమయ్య పేట గ్రామానికి చెందిన యంపాడ రాజేశ్వరి (21)గా గుర్తించారు. ఆమె అదే గ్రామానికి చెందిన దుర్గారావును నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకుంది. వారికి రెండేళ్ల కుమార్తె ఉండగా రెండో కాన్పులో తొమ్మిదో నెల గర్భవతిగా ఉంది. నెలలు నిండడంతో ఆమెను భర్త దుర్గారావు ద్విచక్ర వాహనంపై రిమ్స్ ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం తీసుకెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం ఇంటికి బయలుదేరిన వారికి ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న రాజేశ్వరి తీవ్రంగా గాయపడింది. రక్తస్రావం కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. తల్లి, బిడ్డలు క్షేమంగా ఇంటికి తిరిగొస్తారని అంతా భావించినప్పటికీ వారిని మృత్యువు కబళించింది. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద సమయంలో ఆర్‌టిసి డ్రైవర్ పరారైనట్టు స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కాన్పు కోసం అదే ఆస్పత్రిలో చేరాల్సిన రాజేశ్వరి మృతి చెంది పోస్టు మార్టంకు రావడాన్ని స్థానికులు జీర్ణించుకోలేక పోతున్నారు.



నిందితులను ప్రవేశపెడుతున్న డిఎస్‌పి వెంకట అప్పారావు

7.7 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస ఇందిరా చౌక్ వద్ద గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 7.7 కిలోల గంజాయిని పట్టుకున్నామని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్రమ రవాణాకు వినియోగించిన మోటారు సైకిల్, మూడు సెల్ ఫోన్లు, రూ.3,900 నగదును స్వాధీనం చేసుకున్నామని అన్నారు. ఒడిశా రాష్ట్రం హరువందార్‌కు చెందిన బిసయామిన్ మజీ, అదే గ్రామానికి చెందిన హైబమజీ, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన మైఖేల్ భద్రయటలు బైక్‌పై 7.7. కిలోల గంజాయి ప్యాకెట్లను తీసుకొచ్చారని అన్నారు. దానిని తీసుకుని పలాస రైల్వేస్టేషన్ వైపు అక్రమ రవాణా చేస్తుండగా... ఇందిరాచౌక్ వద్ద తనిఖీలు నిర్వహించి పట్టుకున్నామని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.లక్ష వరకు ఉంటుందని చెప్పారు. వీరు అక్రమ రవాణా చేసేందుకు ఒక్కొక్కరికి కిలో రూ.వెయ్యికి వరకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపచనున్నామని తెలిపారు. సమావేశంలో కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నీలంపేట సర్పంచ్ మృతి

బూర్జ: మండలంలోని నీలదేవీపురం (నీలంపేట) గ్రామ సర్పంచ్ జల్లు సిమ్మన్నమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. సిమ్మన్నమ్మ ప్రస్తుతం సర్పంచ్‌గా కొనసాగు తున్నారు. వీరి కుటుంబ సభ్యులు మూడు పర్యాయాలు పంచాయతీకి సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహించారు. ఆమె మృతిపై మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్‌తో పాటు వైసిపి నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు. ఆమె సోదరుడు జల్లు ఆదినారాయణను పలువురు పరామర్శించారు. సిమ్మన్నమ్మ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. పార్టీలకు అతీతంగా ఆమె అంత్యక్రియలకు మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సిమ్మన్నమ్మ (ఫైల్)

ఐదు రోజుల వ్యవధిలో భార్యాభర్తల మృతి

సోంపేట : మండలంలోని కొర్లాం పంచాయతీ లక్ష్మీపురంలో భార్య మృతి చెందడంతో తట్టుకోలేక ఐదు రోజులకే భర్త మరణించారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని కొర్లాం పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు తామాడ గణపతి కొద్ది రోజులగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. అతని భార్య భారతమ్మ కూడా ఎంపిటిసి మాజీ సభ్యులు ఈమె ఐదు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతిని తట్టుకోలేక మనోవేదనకు గురై భర్త గణపతి సైతం మృతి చెందారు. దీంతో కుటుంబం, గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

గణపతి (ఫైల్)

పరిశీలిస్తున్న కమిషనర్ రమేష్

పూడికతీత పనులు పరిశీలన

ఇచ్ఛాపురం : పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద బంగ్లా రోడ్డులో పూడికతీత పనులను కమిషనర్ ఎన్.రమేష్ సోమవారం పరిశీలించారు. బంగ్లా రోడ్డు కూడలి నుంచి మురుగు కాలువలో పూడికను తీయించారు. ఈయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్రకుమార్ ఉన్నారు.

పరామర్శిస్తున్న సుగుణమ్మ

సుగుణమ్మ పరామర్శ

పోలాకి : మండలంలోని జిల్లెడువలసకు చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సతీమణి సుగుణమ్మ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, ఎఎంసి మాజీ ఛైర్మన్ భైరి భాస్కరరావు, జడూరు ఎంపిటిసి ప్రతినిధి గొండు మురళి, పోలాకి మాజీ సర్పంచ్ ఎల్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకు

వీరఘట్టం: మండలంలోని చిదిమి గ్రామ ప్రధాన రహదారిలో పైప్ లైన్ లీక్ కావడంతో పల్లె ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ పైప్ లైన్ ద్వారా సిఎస్ఆర్ పేట, చిదిమి గ్రామాలకు తాగునీరు సరఫరా కావాల్సి ఉన్నప్పటికీ తరచూగా పైపు లైను లీక్ కావడంతో ఆ గ్రామాలకు పూర్తిస్థాయిలో తాగునీరందక ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజన పంటలు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పాలకొండ: గిరిజనులు పండించిన పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని గిరిజన సంఘ నాయకులు భానుచందర్, చంప తదితరులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ పి.బాలమురళీ కృష్ణను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 80 బస్తాల జీడి పిక్కలు రూ.16వేలకు జిసిసి ద్వారా కొనుగోలు చేయాలన్నారు. గిరిజనులు నివాసం ఉంటున్న ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు చదువు కునేలా పీజీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతులు చదువుతున్న విద్యార్థులకు మూడు నుండి 6 కిలోమీటర్లు పరిధిలో మోడల్ స్కూల్‌లోకి తరలించే ప్రతిపాదన విరమించు కోవాలన్నారు. పాలకొండలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలన్నారు.

సంత మార్కెట్ వద్ద సంకల్పం

సీతంపేట : మండల కేంద్రమైన సీతంపేట వారపు సంత మార్కెట్ వద్ద పోలీసుల ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్సైలు, ఎఎస్ఐ సంజీవ్ సైబర్ నేరాలు గురించి సంతకు వచ్చిన యువతకు ప్రజలకు అవగాహన కల్పించారు. హెల్మెట్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీతంపేట పోలీసులు ఉన్నారు.

గర్భిణులకు తనిఖీలు

సీతానగరం : మండలంలోని పెద్ద అంకలాం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సోమవారం గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పి ఉషారాణి, పి పావని, పి.లావణ్య గర్భిణులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. రక్తహీనత నివారణ కోసం గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతినెల చెకప్‌లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఆర్ వరలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కుమార్ నాయక్‌కు పురస్కారం

ప్రజాశక్తి- పలాస

ఈ నెల 8, 9 తేదీల్లో ఛత్తీస్గఢ్ రాష్ట్రం రాయపూర్‌లో ద్వితీయ తెలుగు మహాసభలు నిర్వహించారు. అందులో డాక్టర్ కుమార్ నాయక్‌కు ఛత్తీస్గఢ్ ఘడ్జానపద పురస్కారం అందించారు. ఆ సభలకు తెలుగు జానపదాలు తరపున ప్రారంభ ఉపన్యాసకులుగా ఏపి జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కుమార్‌నాయక్ మాట్లాడారు. జానపద కళలు, నేడువాటి మనుగడ, భావితరాలకు వాటి ఆవశ్యకత, వీటిపై మాట్లాడారు. ఉత్తరాంధ్ర మాండలికాలు దద్ది, మొకర, నీటి ముళ్ళ, ఇరకాడు, పదాలన్నీ సజీవముల్లై జానపదాలకు జీవం పోస్తున్నాయి. ఛత్తీస్గఢ్‌లో ఉత్తరాంధ్ర జిల్లా నుంచి 2 లక్షల మంది (శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం జిల్లాల)నుండి 2 లక్షల మంది వరకు పాల్గొన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న కుమార్‌నాయక్

వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

పనిభారం తగ్గించాలని వినతి

ప్రజాశక్తి- నౌపడ

పంచాయతీ కార్యదర్శులకు విధుల్లో పనిభారం తగ్గించాలని సంతబొమ్మాళి మండల కార్యదర్శుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు టెక్కలి డిఎల్‌పిఒ ఆర్.గోపీబాల, సంతబొమ్మాళి ఎంపిడిఒ జయంతిప్రసాద్‌లను కలిసి సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల్లో తీవ్రంగా ఒత్తిడి పెరుగుతుందని, దీంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉమాపతి, రాజు, అనిల్ ప్రభాస్, విజయ్ కుమార్, కేశవ పాల్గొన్నారు.

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 439వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా సోమవారం దీక్షలో మాణిక్యపురం గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వ పథకాలకూ దూరమవుతున్నట్టు తెలిపారు. అందుకే తమకి గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సుమన్ బిసాయి, రవి జెన్నా, రాజేష్ బిసాయి, జయసేన్ మజ్జి, హరీష్ సాహు, కృష్ణ బిసాయి పాల్గొన్నారు.

మీటర్ రీడర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి- నందిగాం

స్మార్ట్ మీటర్ల వచ్చే విద్యుత్ మీటర్ల రీడర్ల జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం తక్షణమే ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని స్మార్ట్ మీటర్ల సంఘం టెక్కలి సబ్ డివిజన్ అధ్యక్షులు పొందల శ్రీనివాసరావు, ప్రతినిధులు వండాల ప్రసాదరావు, ముద్దాడ కృష్ణ కోరారు. ఈ మేరకు నందిగాంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. 20 ఏళ్లుగా విద్యుత్ సంస్థలో మీటర్ రీడర్లుగా పనిచేస్తూ సేవలందించామని అన్నారు. కరోనా వంటి విపత్కర సమయంలోనూ ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి రీడింగులు తీసి విద్యుత్ సంస్థకు ఆదాయాన్ని అందించడంలో సహాయ సహకారాలు అందించామన్నారు.

'జ్ఞానజ్యోతి'లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని జ్ఞాన జ్యోతి స్కూల్ 28వ వార్షికోత్సవం, ఫేర్‌వెల్ సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ పొన్నాడ గణేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనంతరం జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో పి.రామకృష్ణారావు, కేశవరావు, కుమార్, సాయిశర్మ, స్కూల్ మేనేజ్‌మెంట్ వెలమల భాస్కరరావు, బోర రామారావు, తంగ్ర సత్యనారాయణ, పాగోటి లక్ష్మి పాల్గొన్నారు.

జ్ఞాపికను అందజేస్తున్న డాక్టర్ గణేష్

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మణిభూషణం

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి- లావేరు

ప్రతిఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని లావేరు పిహెచ్‌సి వైద్యులు మణిభూషణం అన్నారు. సోమవారం తాళ్లవలసలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పుడప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని, సకాలంలో సమయం ప్రకారం ఆహారం తీసుకోవాలని, ఆకుకూరలు తీసుకోవాలని చెప్పారు. మొత్తం 50 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం భవానీ, ఎంఎల్‌హెచ్‌పి హిందుమతి తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా శ్రీరాంకుమార్

ఎన్నికైన ట్రెజరీ ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా శ్రీరాంకుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి కలెక్టరేట్ ఆవరణలో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర నాయకులు హాజరై పర్యవేక్షించారు. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్‌గా భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులుగా జ్యోతి లక్ష్మి, ప్రదీప్‌కుమార్, సాయిప్రసాద్, కోటేశ్వరరావు, కార్యదర్శిగా మాదారపు డేవిడ్, జాయింట్ సెక్రటరీలుగా రమణమ్మ, చంద్రశేఖర్, నారాయణరావు, ట్రెజరర్‌గా వరప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా భూషణరావులు ఎన్నికయ్యారు.

పలువురు పరామర్శ

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మాజీ ఎంపిపి కర్రి కృష్ణవేణి కుటుంబానికి టెక్కలి నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి పేరాడ తిలక్ సోమవారం పరామర్శించారు. ఇటీవల ఆమె కుమారుడు కర్రి నాగిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి నౌపడలో వారి నివాసానికి వెళ్లి మృతుని తండ్రి నౌపడ మాజీ సర్పంచ్ కర్రి విష్ణుమూర్తిని, కుటుంబ సభ్యు పరామర్శించారు. ఆయనతోపాటు వైసిపి నాయకులు పిలక రవికుమార్‌రెడ్డి, ఎంపిటిసి సుధాకర్, లింగరాజు తదితరులు ఉన్నారు.

నౌపడ : పరామర్శిస్తున్న తిలక్

నారాయణరావును పరామర్శిస్తున్న సాయికుమార్

లావేరు: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కెడిఎం విద్యాసంస్థల డైరెక్టర్ కానూరి నారాయణరావును ఎచ్చెర్ల వైసిపి నాయకులు, రణస్థలం ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ సోమవారం పరామర్శించారు. నారాయణరావు భార్య ఇటీవల ఆకస్మాత్తుగా మృతి చెందిన విషయం తెలుసుకున్న సాయికుమార్ పరామర్శించి సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, పిన్నింటి సత్యం, నాయకులు తదితరులు ఉన్నారు.

పశువులకు టీకాలు

సోంపేట : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం పశు వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యాన పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది మోహనరావు, చంద్రశేఖరం, లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి చైతన్య